క్లుప్తంగా

దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఆర్డీఎస్ ఈఈ విజయ్‌కుమార్ రెడ్డి, డీఐఓ, డీఫైఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ ఐడీ–3 వెంకటేశ్వర్‌రావు, డీఈ బీఎస్ఎస్ సేథ్‌లు ఎమ్మెల్యే అబ్రహంను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల7వ తేదీన నీటి పారుదల దినోత్సవం, 8న చెరువుల పండుగ, సాంస్కృతిక హేళ కట్టలపై భోజనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు హాజరు కావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం అధికారులతో సమావేశమై చర్చించారు.

కాంగ్రెస్ నాయకులకు సన్మానం



అయిజ: కొత్తగా ఎన్నుకోబడిన కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులను శనివారం రాష్ట్ర ఓబీసీ కార్యదర్శి షేక్షావలి ఆచారి పట్టణంలో సన్మానం చేశారు. పార్టీ జిల్లా లీగల్ సెల్ చైర్మన్ సురేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ మద్దిలేటిని శాలువలు, పూలమాలలతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి సంపత్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు.

వైకుంఠనారాయణ స్వామికి వాహన సేవ

రాజోళి: మండలంలో వైకుంఠ నారాయణ స్వామి ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారికి వాహన సేవ నిర్వహించారు. శుక్రవారం స్వామి అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా చేపట్టగా, శనివారం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారు సూర్యప్రభ, కల్పవృక్ష వాహనాలపై ఊరేగారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు, స్వపనం చేశారు.

వైర్లు తెగిపడి గడ్డివాము, గుడిసె దగ్ధం



కేటీదొడ్డి: ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడి గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలోని కొండాపురంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపురం చెందిన వడ్డే నారాయణ పొలం వద్ద గడ్డివాముపై ప్రమాదవశాత్తు వైర్లు తెగిపడటంతో గడ్డి పూర్తిగా కాలిపోగా, నిప్పులు గుడిసెపై పడి పూర్తిగా కాలిపోయింది. గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. ఆస్తి నష్టం రూ.3 లక్షలు ఉంటుందని వారు తెలిపారు.

చిత్ర పరిశ్రమలో యువత రాణించాలి

కేటీదొడ్డి: చిత్ర పరిశ్రమలో నడిగడ్డ యువత రాణించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉమిత్యాలకు చెందిన దర్శకుడు ఇటుకల రమేష్ రూపొందించిన పంచాయతీ లఘు చిత్రాన్ని కుచినెర్లలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప ప్రారంభించారు. వివిధ రూపాల్లో ప్రజలకు అవగాహన కలిగించేలా చిత్రాలను తీస్తున్న రమేష్‌ను అభినందించారు. ముస్ముందు మరెన్నో సందేశాత్మక చిత్రాలను నిర్మించాలని డైరెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, సర్పంచ్‌లు తిక్కన్న, గోపాల్, రాజు ఉన్నారు.

రైతులకు సన్మానం



గద్వాల వ్యవసాయం: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని మార్కెట్‌యార్డులో రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 30 మంది రైతులను యార్డు అధికారులు, వ్యాపారస్తులు పూలమాలలు, శాలువాలతో రైతులను సత్కరించారు. కార్యక్రమంలో యార్డు కార్యదర్శి నర్సింహా, గంజ్ వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖరయ్య, పాండు, సాయిబాబ, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అయిజ: పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో శనివారం ఇద్దరు బాలురు బైక్‌పై స్పీడ్‌గా వెళ్తా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న పట్టణానికి చెందిన నేష ఎల్లప్పను ఢీకొట్టారు. దీంతో ఆయన కాలు విరిగింది. ఆయనను వెంటనే కర్నూల్‌లోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్‌ఐ నరేష్‌కుమార్‌ను వివరణ కోరగా కేసు నమోదు కాలేదని తెలిపారు.



అలంపూర్‌లో రైతుల ర్యాలీ



గట్టు మండలం బల్గెరలో..



మల్దకల్ మండలంలో..



మార్లబీడులో రైతులను సన్మానిస్తున్న బండ్ల జ్యోతి

పల్లె పల్లెలో రైతు దినోత్సవం

- కాడెద్దుతో భారీ ర్యాలీ
- ఉత్తమ రైతులకు సత్కారం

సాక్షి, నెట్‌వర్క్: పల్లె పల్లెలో రైతు సంబరాలు కనుల పండువగా సాగాయి. గద్వాల, అలంపూర్ నియోజకవర్గంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా రైతు సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నాయకులు, రైతులు కాడెద్దులతో ఊరేగించారు. రైతు వేదికల్లో రైతులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. రైతు ప్రగతికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు.

- అలంపూర్ మున్సిపాలిటీలో మండల వ్యవసాయ అధికారి అనిత ఆధ్వర్యంలో రైతు సంబరాలు నిర్వహించారు. ఐదుగురు ఉత్తమ రైతులను సన్మానం చేశారు.
- అయిజ మండల కేంద్రంలో, మండలంలోని స్పెషల్ ఆఫీసర్లుగా తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీఓ సాయిప్రకాష్, ఎంపీఓ శంకర్‌లాల్, హార్టికల్చర్ ఆఫీసర్ రాజశేఖర్, ఏఈ లక్ష్మన్న ఆధ్వర్యంలో రైతు దినోత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.



కేటీదొడ్డిలో ఎద్దుల బండ్ల ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

- కేటీదొడ్డి మండల కేంద్రం, కుచినెర్ల, చింతలకుంట, ఇర్కిచేడు, మైలగడ్డలో రైతు దినోత్సవంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, రాష్ట్ర వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప హాజరై ఎద్దుల బండ్ల ర్యాలీను ప్రారంభించారు.
- గట్టు, మాచర్ల, బల్గెర, గొర్లఖాన్‌దొడ్డిలో నిర్వహించిన రైతు సంబరాల ర్యాలీలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ బాసు శ్యామల రైతులతో కలసి గ్రామాల్లో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీలను నిర్వహించారు.
- మల్దకల్ మండలంలోని పెద్దపల్లిలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు.
- ధరూరు మండల కేంద్రంతో పాటు జాంపల్లి, చింతరేవుల, నర్సన్‌దొడ్డి, వామన్‌పల్లి, మార్లబీడు, ర్యాలంపాడు తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ పద్మా, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పాల్గొని రైతు సంబరాలు బ్రోచర్లను విడుదల చేశారు.



ఇటిక్యాల మండలం తిమ్మాపురం రైతువేదిక వద్ద..

- బూరెడ్డిపల్లి సర్పంచ్ బండ్ల జ్యోతి ఓబులోనిపల్లి, మార్లబీడు రైతు సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
- ఉండవెల్లి మండల కేంద్రం, కంచుపాడు, తక్కశీల, మారమునగాల–2, కలుగోట్ల, పుల్లూరులో రైతువేదికల్లో రైతు సంబరాలు నిర్వహించారు.
- అలంపూర్ మండలంలోని బుక్కాపురం క్లస్టర్ పరిధిలో ఏడీఏ సక్రియానాయక్ పాల్గొని వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలను రైతులకు వివరించారు.
- రాజోళి మండలంలో తూర్పుగార్లపాడు, మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడలో కార్యక్రమాలు నిర్వహించారు. ర్యాలీ అనంతరం రైతులకు రైతువేదికల వద్ద విందు భోజనం ఏర్పాటు చేశారు.



అయిజలో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు

- రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ముసాహిదా బేగం అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నెలో రైతు దినోత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆమె హాజరయ్యారు. మండలంలోని రామాపురం, కొంకల, జిల్లెడుదిన్నె, జూలెకల్, వెంకట్రామనగర్, బుడమొర్సు, జక్కిరెడ్డిపల్లి, వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్, పైపాడులో సంబరాలు ఘనంగా నిర్వహించారు.
- ఇటిక్యాల మండలంలోని పుటాన్‌దొడ్డి, పెద్ద దిన్నె, ఇటిక్యాల, చాగాపురం, తిమ్మాపురం, ధర్మవరం గ్రామాలలో రైతు వేదికల వద్దకి ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ చేశారు.



ఉండవెల్లిలో..



అలంపూర్ మండలం బుక్కాపూర్‌లో..



రాజోళి మండలం తూర్పు గార్లపాడులో..



వడ్డేపల్లి మండలం కోయిల్‌దిన్నెలో..

రైతుల ఆత్మహత్యలే మీకు అభివృద్ధా?



నిరసనలో మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

రాజోళి: రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే అవే ప్రభుత్వానికి అభివృద్ధిలా కనిపిస్తున్నాయా అని బీఎస్పీ నాయకులు ప్రశ్నించారు. శనివారం ప్రభుత్వం తలపెట్టిన రైతు దినోత్సవానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. రైతులకు రూ.లక్ష రుణమాఫీ అని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక మరిచిపోయారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లేవని, ఉచితంగా ఎరువులు అందిస్తామని చెప్పి మాటలన్నీ గాలికి వదిలేశారన్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే బీఆర్‌ఎస్‌కు అన్నదాతల ఆక్రందనలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. అలంపూర్‌లో మూడు రిజర్వాయర్లు నిర్మిస్తామని చెప్పి, అసంపూర్తి పనులతో, అబద్ధపు మాటలతో రైతులను మోసం చేస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఏమి సాధించిందని సంబరాలు చేస్తున్నారన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, ఇన్‌చార్జ్ మధుగౌడ్, కోశాధికారి నాగేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, వెంకటేష్, రాజారావ్, మద్దిలేటి, నాగజ్యోతి, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన రైతు దినోత్సవం

రాజోళి: మండలంలోని పచ్చర్లలో రైతు దినోత్సవం నిలిచిపోయింది. రైతు సమన్వయ సమితి అధ్యక్షుడి విషయంలో చోటు చేసుకున్న పరిణామాల కారణంగా శనివారం కార్యక్రమం నిలిచిపోయింది. ఇరువర్గాల వాగ్వివాదంతో కొంత ఘర్షణ వాతావరణం చోటు చేసుకున్నట్లు సమాచారం. గతంలో సర్పంచ్‌గా పని చేసిన ఒక వ్యక్తి రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడిగా గతంలో ఒకరిపేరును ప్రతిపాదించగా, ఏళ్లుగా ఆయనే అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. ఆయన స్థానంలో మరొక వర్గానికి చెందిన వ్యక్తిని రైతువేదికల నిర్మాణ సమయంలో అధ్యక్షుడిగా చేస్తున్నట్లు పార్టీ తరపున ధ్రువీకరించారు. శనివారం చేపట్టిన కార్యక్రమంలో పాత అధ్యక్షుడినే మరింత సమయం కొనసాగించాలని ఒక వర్గం పట్టుబడటంతో, ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో చేసేదేమి లేక అధికారులు కార్యక్రమాన్ని అర్ధాంతరంగా నిలిపేశారు. ఘనంగా నిర్వహించాల్సిన సంబరాల్లో ఒకే పార్టీకి చెందిన వారి కారణంగా కార్యక్రమం నిలిచిపోవడంతో గ్రామస్తులు ముక్కున వేలుసుకుంటున్నారు.



పచ్చర్లలోని రైతువేదికలో వాగ్వాదానికి దిగిన ఇరువర్గాలు

పిల్లలతో పనులు చేయించడం నేరం



మానవపాడులో బడిబాట నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ



గట్టులో అంగన్‌వాడీ టీచర్ల బడిబాట

ధరూరు: బడీడు పిల్లలందరూ బడిలనే ఉండాలని ఎంఈఓ సురేష్, జీహెచ్‌ఎం ప్రతాప్‌రెడ్డి సూచించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని మన్నాపురం, సోంపురం, భీంపురం, దోర్నాల, గుర్రోనిపల్లి, బూరెడ్డిపల్లి, చిన్నపాడు, పారుచర్ల, జాంపల్లిలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరిగి బడి బయటి పిల్లలను బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, రేవతి, శ్రీధర్, మహేశ్వరి, సుందర్, అబ్దుల్లా, ఏకాంత్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీల బడిబాట కార్యక్రమం శనివారం ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఐదేళ్లు నిండిన పిల్లలను సంబంధిత పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

గట్టు: అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గట్టు, మాచర్లలో అంగన్‌వాడీ టీచర్లు ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.

మల్దకల్: బడీడు పిల్లలతో రైతులు పొలం పనులు చేయించుకోవడం చట్టరీత్యానేరమని సీడీపీఓ కమలాదేవి హెచ్చరించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పెద్దపల్లి, మల్లెందొడ్డిలో బడిబాట ర్యాలీ నిర్వహించారు.

బడిలోనే బంగారు భవిష్యత్..

బంగారు భవిష్యత్‌కు పునాదులు పడతాయని, బడీడు కలిగిన పిల్లలందరిని తప్పని సరిగా బడిలోనే చేర్పించాలని ఎంఈఓ కొండారెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆదిశిలా క్షేత్రంలో భక్తుల పూజలు



మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఈసందర్భంగా అర్చకులు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశాలు

కేటీదొడ్డి: గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కేటీదొడ్డి గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో పదోతరగతి ఉత్తీర్ణులైన రెగ్యులర్ విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రూ.100 చెల్లించి htpp//tgtwgurukulam.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 8501873506 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరుకు చెందిన చాకలి మహేశ్వరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సాసనూలు ఉప సర్పంచ్ పెద్ద వీరన్న శనివారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ. 10వేలు అందించారు. అదేవిధంగా సాసనూలుకు చెందిన పరమేశ్వరయ్య బాధిత కుటుంబ సభ్యులకు కిరాణ సామగ్రి అందించారు.

మోదీ పాలనలో నవశకం

రాజోళి: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశంలో నవశకం మొదలైందని బీజేపీ స్టేట్ ఎడ్యుకేషనల్ సెల్ కన్వీనర్ బంగి లక్ష్మణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరయ్యారు. రాష్ట్రంలో అమలవుతున్న ఎన్నో పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఆ విషయాలను చెప్పడం లేదన్నారు.

కొవ్వొత్తులతో నివాళి

అయిజ: రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మెడికల్ తిరుమలరెడ్డి, రాజగోపాల్, భీమసేనరావు, లక్ష్మణ్, ఆంజనేయులు పాల్గొన్నారు.



అయిజలో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రైతులను మోసం చేసినందుకు సంబరాలా?



మాట్లాడుతున్న బుచ్చిబాబు

గద్వాల అర్బన్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు రైతులకు మోసం చేసినందుకు దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని అని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా మోసం చేసినందుకా, వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట కాంటా వద్ద అవకతవకలు చేస్తున్నందుకా? రైతులకు సబ్సిడీ ఇవ్వనందుకా? ధరణి పోర్టల్ ద్వారా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నందుకా? ఉచిత కరెంట్ అని చెప్పి బిల్లులు వసూలు చేయడం కోసం రైతు దినోత్సవం చేస్తున్నారని అని ధ్వజమెత్తారు. సమావేశంలో లవన్న, వెంకట్రాములు, జమ్మన్న, గోవిందు, మునెప్ప, రాము, తిప్పన్న, గోపాల్, కిష్టన్న, ఆశన్న తదితరులు ఉన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



కొండాపురంలో ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురం, గువ్వలదిన్నె, కుచినెర్ల, సోంపురం, చింతలకుంటలో రైతులు ఏరువాక పౌర్ణమి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకులమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో తరలివచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా గ్రామంలో రైతులు ఎద్దుల బండ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉరుకుందు, హనుమంతు, గోవిందు, కొండన్న, యుగంధర్ పాల్గొన్నారు.

రాయాపురంలో..

గట్టు: మండలంలోని రాయాపురం శనివారం ఏరువాక పండుగను ఘనంగా నిర్వహించారు. ముంగారి సేద్యం ప్రారంభంలో రైతులు చేసుకునే తొలి పండుగా ఏరువాక పండుగ. సేద్యంలో తొడుగా ఉంటే కాడెద్దులతో పాటుగా గ్రామ దేవతలకు రైతులు పిండి వంటలతో నైవేద్యం సమర్పించుకుని ముంగారి సేద్యం చక్కగా ముందుకు సాగాలని కోరుతూ పూజలను నిర్వహించారు. సాయంత్రం కాడెద్దులతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మారెమ్మవ్వ పండుగ సందర్భంగా గ్రామస్తులు పూజలు చేపట్టారు. కాడెద్దుల పరుగు పందెం పోటీలను గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.



రాయాపురంలో ఎద్దుల పరుగు పందెం పోటీలు

ఎర్రవల్లిచౌరస్తా: ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని ఇటిక్యాల మండలంలోని గ్రామాలలో శనివారం సంబరాలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. తొలకరి జల్లులు కురవడంతో పాడిపశువులను భక్తిశ్రద్ధలతో పూజించి ఆనందోత్సవాల నడుమ గ్రామాలలోని రైతులు ఉదయం అరక దున్నడంను ప్రారంభించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రతి ఇంట్లో తీపి పదార్థాలతో సంబరాలను చేసుకున్నారు. సాయంత్రం రైతులకు గ్రామ దేవత సుంకులమ్మకు బోనాలలో నైవేద్యం వండి గ్రామస్తులతో సమూహంగా వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.



యాక్తాపురంలో నైవేద్య బోనాలతో సుంకులమ్మ గుడికి వెళ్తున్న ప్రజలు